# వచ్చే ఎన్నికల్లో

# అధికారం మనదే

## తెదేపా నాయకులతో చంద్రబాబు



గుంతకల్లులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో మీకోసం సభకు హాజరైన ప్రజలు (అంతర్ చిత్రంలో) ప్రసంగిస్తున్న బాబు

గుత్తి, ఆగస్టు 11 (న్యూస్‌టుడే): ఎన్నికల సమరం ఆసన్నమవుతోంది. ఐక్యంగా పార్టీని బలోపేతం చేయడానికి కష్టపడి పనిచేయాలి. రాబోయే ఎన్నికల్లో తెదేపా అధికారం కైవసం చేసుకుంటుందని ఆపార్టీ అధినేత చంద్రబాబునాయుడు ధీమా వ్యక్తం చేశారు. అనైక్యతకు తావివ్వరాదని ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాడాలని ఆయన పిలుపు ఇచ్చారు. మీకోసం యాత్రలో భాగంగా గుత్తికివచ్చిన ఆయన ఎస్.కె.డి. కళాశాలలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శింగనమల, తాడిపత్రి, గుత్తి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితిని సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరిద్దరు నాయకులు పార్టీని వీడిపోయినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదు. కార్యకర్తలు ఎక్కడా చెదరటం లేదని చెప్పారు. పార్టీకి కేడర్ బాగా ఉంది. నాయకుల మధ్యే కొంత సఖ్యత ఉండటం లేదని పత్రికల్లో వార్తలొచ్చాయి. వాటిని చదివాను. నేను పూర్తిగా మారాను. నాతోపాటు నాయకులు కూడా మారాలని, పార్టీ పటిష్ఠతకు కృషిచేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని, అందరికీ తగిన న్యాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ వల్ల ఇబ్బందులకు గురైన వారిని ఆదుకుంటానని, పరిటాల హత్య అనంతరం అనేకమంది కార్యకర్తలు జైలుకు వెళ్లారని ఆయన చెప్పారు. ఈ కష్టాలను చూసి నేనెంతో బాధపడుతున్నానన్నారు. ఐక్యంగా విభేదాలు లేకుండా ముందుకు వెళదాం. 2009 ఎన్నికలలో తెదేపా విజయం సాధించి తీరుతుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఖాయమని స్పష్టం చేశారు. ఈ జిల్లాను నేను ఎప్పుడూ మరువలేను. నాయకులు కలిసి పనిచేస్తే 14 శాసనసభ స్థానాలను గెలుచుకుంటామన్నారు. తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పేరం నాగిరెడ్డి, మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాష, మాజీ మంత్రి శమంతకమణి, జెడ్‌పీటీసీ సభ్యుడు శరత్‌చంద్రారెడ్డి, గుత్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.సి.నారాయణ, నాయకులు సాయినాథ్‌గౌడ్, నిర్మలారెడ్డి, మైనుద్దీన్, ఎంపీపీ ఫైరోజ్‌బేగం, పాల్గొన్నారు.

**జనసంద్రమైన గుత్తి:** 'మీకోసం' యాత్రలో భాగంగా సోమవారం గుత్తిలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చారు. మూడు గంటలకు చంద్రబాబు రోడ్డుషో నిర్వహిస్తూ గాంధీచౌక్ చేరుకున్నారు. ఆయనకు ప్రజలు కేరింతలు, జేజేలు చెబుతూ నీరాజనం పలికారు. దీంతో పట్టణం అంతా జనసంద్రంగా మారింది. అన్నివర్గాల ప్రజలు అశేషంగా తరలిరావటంతో గుత్తి ప్రజల ఆధరాభిమానాన్ని ఎన్నడూ మరువబోనని చంద్రబాబు అన్నారు. ఓవైపు ఉపన్యసిస్తూనే ప్రజల నుంచి మద్దతును కూడగట్టే ప్రయత్నం చేశారు.

### పేదరికం లేని సమాజమే ధ్యేయం

పేదరికం లేని సమాజంను ఏర్పాటు చేయటమే తెదేపా ధ్యేయమని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. మంచిపాలన ద్వారా పేదల ఆదాయాన్ని పెంపొందించి ఆర్థికాభివృద్ధికి పాటుపడతామని చెప్పారు. మీకోసం యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం గుత్తిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆడపడుచులు, రైతులు, కూలీలు, చేతివృత్తిదార్ల సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నానన్నారు. బియ్యం, కందిపప్పు, కూరగాయలు, వంటనూనె ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నా... వాటిని నియంత్రించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు రుణాల మాఫీ, రెండు బల్బులు, ఫ్యాన్, టి.వి. ఉన్న వారికి ఉచితంగా విద్యుత్తుఇస్తామని, ఇంటర్మీడియట్ వరకూ విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తామని ఆయన హామీలు కురిపించారు. బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని, విద్యావాలంటీర్ల సమస్యను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. గుత్తి ఆర్టీసీ డిపోను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని, గుత్తి, పాతకొత్తచెరవు, వై.టి.చెరువుల ఆయకట్టుకు హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి సాగునీటిని అందించి రైతులను ఆదుకుంటామన్నారు. అనంతపురంలో జరిగే పునరంకిత సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎం.పి. కాలువ శ్రీనివాసులు ఈ సందర్భంగాకోరారు. రాక్షసపాలనలో ఉన్నామని, కాంగ్రెస్‌ను గద్దెదింపాలని మాజీ ఎమ్మెల్యే సాయినాథ్‌గౌడ్ చెప్పారు. మోసపూరిత హామీలతో అధికారం దక్కించుకున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని తెదేపా గుత్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కె.సి.నారాయణ పేర్కొన్నారు. చంద్రబాబు వెంట మాజీ మంత్రి శమంతకమణి, గుత్తి ఎంపీపీ ఫైరోజ్‌బేగం, జెడ్‌పీటీసీ సభ్యురాలు కమలాక్షమ్మ, తెదేపా జిల్లా ఉపాధ్యక్షురాలు నిర్మలారెడ్డి, జడ్‌పీ కోఆప్షన్ సభ్యుడు మైనుద్దీన్, పామిడి జెడ్‌పీటీసీ సభ్యురాలు లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు



హాజరైన కార్యకర్తలు



తప్పెట్లతో హుషారు...